నిరసనలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శాయంపేటలో నిరసన

శాయంపేట, మార్చి 26 : రాష్ట్రంలో రూ.7,200కోట్ల ఉపకార, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శాయంపేట బస్టాండ్ సెంటర్‌లో బుధవారం నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌లో అతి తక్కువ నిధులు కేటాయించి ప్రభుత్వం విద్య రంగాన్ని భ్రష్టుపట్టిస్తున్నదన్నారు. ఉపకార, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, సాయికుమార్, అఖిల్, కన్నారావు, సన్నీ, శశాంక్, మంద అజయ్, సందీప్ పాల్గొన్నారు.

అనుమతి లేని షాపును తొలగించాలి

పరకాల, మార్చి 26 : అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న జ్యూస్ పాయింట్‌ను తొలగించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఏకు శంకర్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ చెల్పూరి వెంకటేశ్‌కు వినతిపత్రం అందించారు. పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో ప్రధాన రహదారిని ఆనుకుని అనుమతులు లేకుండా రేకులు వేసి జ్యూస్ పాయింట్ నిర్వహించడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నదన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు జ్యూస్ పాయింట్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.

పర్యావరణ సమతుల్యత పెంపొందించాలి

కలెక్టర్ ప్రావీణ్య

కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, మార్చి 26 : ఆధునిక ప్రపంచంలో సుస్థిరాభివృద్ధికి వివిధ రకాల శక్తి వనరులను సంరక్షించుకోవడానికి పర్యావరణ సమతుల్యత పెంపొందించాలని, అందుకు మెటీరియల్ సైన్స్ దోహద పడుతుందని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. బుధవారం వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో పిన్సిపాల్, లెఫ్టినెంట్ చంద్రమౌళి అధ్యక్షతన 'ఇంటర్ డిసిప్లినరీ మెటీరియల్స్ సైన్స్ ఫర్ సస్టైనబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్' (ఎన్‌సీఐఎంఎస్ఎస్ఈఈ -2025) అనే అంశంపై జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలు సృజనాత్మక ఆలోచనా విధానాలతో సుస్థిరాభివృద్ధిలో భాగం కావాలన్నారు. కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ ప్లస్, ఎక్స్ లెన్స్ గ్రేడ్ రావడానికి కావాల్సిన అన్నిరకాల వసతుల కల్పనకు తోడ్పాటు అందిస్తామమి తెలిపారు. అదేవిధంగా కళాశాల వసతి గృహంపై అదనపు అంతస్తు నిర్మాణానికి సంబంధిత అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడుతానని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మెటీరియల్ సైన్స్‌లో నూతన ఆవిష్కరణల ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. మెటీరియల్ సైన్స్‌ను వినియోగించుకొని వివిధ రకాల ప్రాణుల ఆకారాల మాదిరితో బుల్లెట్ ట్రెయిన్, అత్యాధునిక వాహనాలు తయారు చేశారని వరంగల్ ఎన్ఐటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ హరినాథ్ అన్నారు. సదస్సు కన్వీనర్, అగ్రనైజింగ్ సెక్రటరీ అరుణ జాతీయ కాన్ఫరెన్స్ ప్రాధాన్యతను తెలిపారు. సదస్సులో 120 మంది రాసిన పరిశోధక పత్ర వ్యాసాలను ఆవిష్కరించారు. వరంగల్ ఎన్‌వైకే డిప్యూటీ డైరెక్టర్ అన్వేశ్, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, కో కన్వీనర్ కవిత, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ సురేశ్‌బాబు, అకాడమిక్ కో ఆర్డినేటర్ అరుణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

నయీంనగర్, మార్చి 26 : హనుమకొండలోని పలు స్కానింగ్ సెంటర్లను డీఎంహెచ్‌వో అప్పయ్య బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు, సర్టిఫికెట్లు, స్కానింగ్ మిషన్ల ఫాం ఎఫ్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రికార్డులను పరిశీలించారు. స్కాన్ రిపోర్టులు, ఇమేజ్‌లను రెండు సంవత్సరాలు భద్రపర్చాలని, సంతాన సాఫల్య కేంద్రాలు ఏఆర్ఆర్టీ చట్టానికి లోబడి పని చేయాలన్నారు. ఎంటీపీ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు మాత్రమే అబార్షన్లు చేయాలని, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ లేకుండా అర్హత లేని డాక్టర్లు అబార్షన్లు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మంజుల, హైమావతి, మంగ, సందీప్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు

మాట్లాడుతున్న డీఆర్వో వైవీ గణేశ్

హనుమకొండ, మార్చి 26 : మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని డీఆర్వో వైవీ గణేశ్, సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించే వారిపై, వినియోగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సినిమా హాళ్లలో కూడా మత్తు పదార్థాల నియంత్రణకు స్టైడ్స్ వేసేలా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడంతో పాటు విస్తృత ప్రచారం చేపట్టేందుకు క్రీడలు, ఇతర రంగాల సెలబ్రిటీలతో ప్రచారం చేయించాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో అప్పయ్య, పరకాల ఆర్డీవో నారాయణ, హనుమకొండ, కాజీపేట ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, తిరుమల్ పాల్గొన్నారు.

ప్రాచీన కట్టడాలను కాపాడుకోవాలి

ప్రాచీన కట్టడాల వద్ద విద్యార్థులు

దామెర, మార్చి 26 : మండలంలోని కోగిల్వాయి గ్రామంలో ప్రాచీన కట్టడమైన శ్రీచంద్రగిరి చెన్నకేశవ స్వామి ఆలయాన్ని ఇంటాక్ వరంగల్ చాప్టర్ సహకారంతో ఊరుగొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు బుధవారం సందర్శించారు. ప్రాచీన కట్టడాల ప్రాముఖ్యతను చరిత్రకారుడు, ఉపాధ్యాయుడు రాచర్ల గణపతి విద్యార్థులకు వివరించారు. 15వ శతాబ్దంలో వేచర్ల పద్మనాయకుల పాలనలో కోట గడీలు, దేవాలయాలు, భైరవ శిలలు, నీటి కొలనులు ఎంతో ప్రాచుర్యం పొందాయన్నారు. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉపాధ్యాయులు సునీత, అనితకుమారి, విజయప్రభ, వసుంధర, స్వరూపారాణి, శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుల సర్వేభారం మోపొద్దు

దామెర, మార్చి 26 : పంచాయతీ కార్యదర్శులకు రేషన్‌కార్డుల సర్వేను అప్పగించి పనిభారం మోపొద్దని కోరుతూ ఎంపీడీవో కల్పనకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యదర్శి ఇంజపల్లి నరేశ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇప్పటికే తాగునీటి సరఫరా, ఎల్ఆర్ఎస్ సర్వే, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గుర్తింపు, వందశాతం ఇంటిపన్నుల వసూళ్లు, ఉపాధి పనుల్లో కార్యదర్శులు అదనపు పనిభారం మోస్తున్నారని తెలిపారు. కొత్తగా రేషన్ కార్డుల సర్వే అంటూ మరింత పనిభారం మోపొద్దని, కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. జీపీ కార్యదర్శి శివ శంకర్, పరకాల డివిజన్ అధ్యక్షుడు వేణుమాధవ్, సరళ, కవిత పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శాయంపేట, మార్చి 26 : వ్యవసాయ యాంత్రీకరణ పథకం (సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్) కింద సబ్సిడీ యంత్ర పరికరాలు అందించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి గంగాజమున బుధవారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, జనరల్ మహిళా రైతులకు యాభై శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందించనున్నట్లు చెప్పారు. ఈ పథకం కింద మండలానికి బ్యాటరీ స్ప్రేయర్స్ -5, తైవాన్ స్ప్రేయర్స్- 5, రోటవేటర్స్-2, కల్టివేటర్స్-3, ఎరువులు, విత్తనాలు వేసుకునే యంత్రం 1, పవర్ టిల్లర్-1, పవర్ వీడర్ 1, బ్రష్ కట్టర్ 1, బండ్ ఫార్మర్ 1, వరి గడ్డి చుట్టే యంత్రం 1, డ్రోన్ 1, ట్రాక్టర్ 1 కేటాయించినట్లు తెలిపారు. మహిళా రైతులు దరఖాస్తుతో పాటు కొత్తగా జారీచేసిన పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు కాపీ, కుల ధ్రువీకరణ పత్రం, ట్రాక్టర్‌కు సంబంధించిన పరికరాలకు రిజిస్ట్రేషన్ పేపర్లతో ఫొటో అతికించిన దరఖాస్తును శాయంపేటలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఈ నెల 29వ తేదీలోగా అందజేయాలని కోరారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

భీమదేవరపల్లి, మార్చి 26 : రైతులు భూసార పరీక్షలు నిర్వహించి తగిన మోతాదులో సేంద్రియ ఎరువులు వాడితే ప్రయోజనం ఉంటుందని బీసీఐ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మహేందర్ అన్నారు. బుధవారం మండలంలోని మాణిక్యాపూర్ గ్రామంలో డబ్ల్యుడబ్ల్యుఎఫ్ నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ, జీవ సంబంధిత మందులను మార్కెట్‌లోకి విడుదల కార్యక్రమం జరిగింది. రైతులు తమ వ్యవసాయ భూముల నుంచి తెచ్చిన మట్టిని పరీక్షించి వారి సమక్షంలోనే ఫలితాలు వెల్లడించారు. బీసీఐ ప్రాజెక్టు మేనేజర్ సింధురెడ్డి, కోఆర్డినేటర్ బొట్ల సతీశ్ కుమార్ పాల్గొన్నారు.

వేలేరు పోలీస్ స్టేషన్ పరిధి బోర్డుల ఏర్పాటు

వేలేరు, మార్చి 26 : వేలేరు పోలీస్ స్టేషన్ హద్దు బోర్డులను ఎస్సై సురేశ్ బుధవారం ఏర్పాటు చేశారు. పైఅధికారుల సూచన మేరకు సైన్ బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కానిస్టేబుల్ ఉప్పలయ్య, హోంగార్డు సంపత్ పాల్గొన్నారు.

భద్రకాళీ హుండీ ఆదాయం రూ. 14.97 లక్షలు

వరంగల్, మార్చి 26 : భద్రకాళీ ఆలయ హుండీ లెక్కింపు ద్వారా రూ. 14,97,412 ఆదాయం వచ్చింది. బుధవారం ఆలయ మహా మండపంలో దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్, ఈవో శేషుభారతి, ప్రధాన అర్చకుడు శేషు, అధికారుల పర్యవేక్షణలో హుండీలు లెక్కించారు. 14 యూఎస్ డాలర్లు, 10 ఇంగ్లాండ్ పౌండ్లు, 5 యుఏఈ ధిర్‌హమ్స్, 10 యూరోలు లభించాయి. నగదును యూనియన్ బ్యాంకులో జమ చేశారు. మిశ్రమ బంగారం, వెండిని తిరిగి హుండీలో వేసి సీల్ చేశారు. హుండీల లెక్కింపులో శ్రీలక్ష్మీ శ్రీనివాస సేవా ట్రస్ట్, లక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న యువకులు

నయీంనగర్, మార్చి 26 : హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలో ఓ వ్యక్తికి ఫిట్స్ రావడంతో యువకులు చాకచక్యంగా వ్యవహరించి మానవత్వం చాటుకున్నారు. వేలేరు మండలానికి చెందిన దిలీప్‌రెడ్డి హనుమకొండలోని ఓ ఆస్పత్రికి తన స్నేహితుడితో కలిసి వచ్చాడు. మధ్యాహ్నం గార్డెన్‌లో భోజనం చేస్తున్న సమయంలో ఫిట్స్ రావడంతో అక్కడే ఉన్న కొందరు యువకులు స్పందించి అతడికి ప్రథమ చికిత్స చేసి, 108కి సమాచారం అందించారు.

హ్యాండ్‌బ్యాగ్ దొరికితే అప్పగించాలని వేడుకోలు

ఐనవోలు, మార్చి 26 : హ్యాండ్ బ్యాగ్ పోయింది. దొరికితే తిరిగి అప్పగించాలని బాధితురాలు వేడుకున్నది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన బండి మంజుల తన సోదరుడితో కలిసి ద్విచక్రవాహనంపై ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చింది. వసున్న క్రమంలో ఆమె హ్యాండ్‌బ్యాగ్ ఆలయ ముఖద్వారం సమీపంలో పడిపోయినట్లు తెలిపారు. బ్యాగ్‌లో ల్యాండ్ ఒరిజినల్ డాక్యుమెంట్, ఏటీఎం, కొంత మేరకు నగదు ఉన్నదని, ఎవరికైనా బ్యాగ్ దొరికితే 9849204802 నంబర్‌కు సమాచారం అందించాలని లేదా పోలీ సుస్టేషన్, ఈవో కార్యాలయంలో అప్పగించాలని బాధితురాలు వేడుకున్నది.

ఇంటర్ మూల్యాంకనంలో మార్పులు

హనుమకొండ చౌరస్తా, మార్చి 26 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు-2025 మూల్యాంకన కేంద్రం క్యాంపు నంబర్-20లో బాటనీ, జువాలజీ సమాధాన పత్రాల మూల్యాంకనం 28కి బదులుగా 27వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి గోపాల్ తెలిపారు. అన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లు మూల్యాంకన విధులు కేటాయించిన అధ్యాపకులను రిలీవ్ చేయాలని ఆదేశించారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సభ్యత్వ నమోదు

హనుమకొండ చౌరస్తా, మార్చి 26 : గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షతన బుధవారం నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య పాల్గొన్నారు.

పారిశుధ్యంలో పిన్ పాయింట్ ప్రోగ్రాం అమలు చేయాలి

- జవాన్లు నిర్లక్ష్యం చేస్తే షోకాజ్ నోటీసులు
- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మార్చి 26 : సమర్థ పారిశుధ్య నిర్వహణలో భాగంగా ఆ విభాగ అధికారులు పిన్ పాయింట్ ప్రోగ్రాం అమలు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. బుధవారం పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్ల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిన్ పాయింట్ ప్రోగ్రాంలో భాగంగా జవాన్లు క్లీనింగ్, స్వీపింగ్, లాగ్ బుక్కులను కచ్చితంగా నిర్వహించేలా చూడాలన్నారు. ఈ ప్రోగ్రాం అమలులో నిర్లక్ష్య వహించిన జవాన్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సీఎంహెచ్‌వోను ఆదేశించారు. సమయ పాలనతో పాటు ప్రతి చెత్త తరలింపు వాహనం రెండు ట్రిప్పులు నడపాలన్నారు. ట్రేడ్ లైసెన్స్, ఆస్తి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. కాజీపేట సర్కిల్‌లో 6, కాశీబుగ్గ పరిధిలో 5 బృందాలు ప్రతి రోజూ రూ.50లక్షల చొప్పున పన్నులు వసూలు చేయాలని టార్గెట్ విధించారు. పారిశు ధ్య పనుల్లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సిద్ధార్థ నగర్‌లో రోడ్డుపై ఇసుక వేసిన యజమానికి జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ పనులు వేగంగా పూర్తి చేయాలి..

గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో పురోగతిలో ఉన్న స్మార్ట్‌సిటీ పనులను వేగవంతం చేయాలని స్మార్ట్‌సిటీ బోర్డు సమావేశంలో నిర్ణయించారు. బుధవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ అధ్యక్షతన 28వ స్మార్ట్‌సిటీ బోర్డు సమావేశం జరిగింది. ప్రస్తుతం పురోగతిలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సమావేశం అభిప్రాయపడింది. మార్చి 31వ తేదీ నాటికి స్మార్ట్‌సిటీ గడువు ముగియనున్న అంశంపై చర్చించారు. సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి, ఈఎన్‌సీ భాస్కర్‌రెడ్డి, డీటీసీపీ దేవేందర్‌రెడ్డి, బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిలకు ఓటీఎస్..
- అపరాధ రుసుములో 90 శాతం మాఫీ

మరో ఐదు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో పెండింగ్ ఆస్తి పన్నుల బకాయిలకు వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)ను మున్సిపల్ శాఖ ప్రకటించింది. ఆస్తి పన్నులతో పాటు పెద్ద మొత్తంలో అపరాధ రుసుము ఉన్న వారికి మంచి ఆఫర్ ఇచ్చింది. మార్చి 31లోగా పెండింగ్ పన్ను బకాయిలు చెల్లిస్తే అపరాధ రుసుములో 90 శాతం మాఫీ చేయనున్నారు. పన్ను బకాయిదారులు ఓటీఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కోరారు. బల్దియా ఉద్యోగులు ఓటీఎస్‌పై బకాయిదారులకు అవగాహన కల్పించి మొండి బకాయిలు వసూలు చేయాలని సూచించారు.

వేలేరు : ఎర్రబెల్లి గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రమేశ్ రాథోడ్

గౌరవెల్లి ప్రాజెక్టు కెనాళ్ల భూ సేకరణపై సమావేశం

భీమదేవరపల్లి/వేలేరు, మార్చి 26 : గౌరవెల్లి ప్రాజెక్టు కెనాళ్ల భూ సేకరణపై బుధవారం భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం, వేలేరు మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో రైతులతో అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్డీవో రమేశ్ రాథోడ్, డిప్యూటీ ఈఈ చైతన్య హాజరయ్యారు. భూములు కోల్పోతున్న రైతుల పేర్లను ఆర్ఐ శ్రీధర్ చదివి వినిపించారు. ఆయా సభల్లో ఆర్డీవో రమేశ్ రాథోడ్ మాట్లాడుతూ.. గౌరవెల్లి రిజర్వాయర్ మెయిన్ కెనాల్ నుంచి డిస్ట్రిబ్యూషన్ కెనాళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కెనాళ్ల నిర్మాణానికి భూములు సేకరిస్తున్నామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపాలని రైతులను కోరారు. కాల్వల ద్వారా నీరు వస్తే రైతులకు సాగునీటి ఎద్దడి ఉండదన్నారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ కెనాల్ ద్వారా ఎర్రబెల్లిలో సుమారు 2వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. తహసీల్దార్లు ప్రవీణ్‌కుమార్, కొమి, భూ సేకరణ అధికారి రాజ్‌కుమార్, ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, ఆర్ఐలు సురేందర్, శ్రీధర్, రాజు, సీఐ పులి రమేశ్, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, దివ్య, జీపీ కార్యదర్శి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు ఏప్రిల్ '2న చలో ఢిల్లీ'

హనుమకొండ, మార్చి 26 : బీసీ రిజర్వేషన్ల అమలు కోసం చేస్తున్న పోరాటం గల్లీలో ముగిసింది.. ఇక ఢిల్లీలో చేపడుతున్నామని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ఏప్రిల్ 2న చేపట్టిన హలో బీసీ.. చలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను బుధవారం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు విద్య, ఉద్యోగ రంగాలతో పాటు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఏప్రిల్ 2న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో దేశంలోని 29 రాష్ట్రాల నుంచి ఢిల్లీని బీసీల దండు ముట్టడించబోతున్నదని తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీలోగా కేంద్రం బీసీ బిల్లును ఆమోదిస్తే విజయోత్సవ సభ పెడతామన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బచ్చు ఆనందం, దాడి మల్లయ్య యాదవ్, జిల్లా నాయకులు కాసాగోని అశోక్, నాగరాజు, అనిల్, సమ్మయ్య, రమేశ్, మధు పాల్గొన్నారు.

ప్రైవేట్ డీఎడ్ కళాశాలలు రెన్యువల్ చేసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, మార్చి 26 : గుర్తింపు పొందిన డీఎడ్ కళాశాలలు అఫిలియేషన్ ఆఫ్ రెన్యువల్ (2025-26 నుంచి 2028-29) నాలుగు సంవత్సరాల కోర్సు నిర్వహించడానికి అఫిలియేషన్ ఫీజు రూ.1 లక్ష చెల్లించాలని ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. సంబంధిత ఫీజుతో పాటు అఫిలియేషన్ ప్రపోజల్ మెంబర్ కన్వీనర్(సంచాలకులు, ఏసీసీఈఆర్టీ తెలంగాణ, హైదరాబాద్) వారికి ఈ నెల 31వ తేదీలోగా పంపాలన్నారు.

కేయూ గ్రంథాలయ మెంబర్ ఇన్‌చార్జిగా రాధికారాణి

హనుమకొండ చౌరస్తా, మార్చి 26 : కేయూ కేంద్ర గ్రంథాలయ నూతన మెంబర్ ఇన్‌చార్జిగా లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి రాధికారాణిని నియమిస్తూ రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. రాధికారాణి ప్రస్తుత మెంబర్ ఇన్‌చార్జి శ్రీలత నుంచి బాధ్యతలు స్వీకరించారు. కాకతీయ విశ్వవిద్యాలయ లైబ్రరీ సైన్స్ విద్యార్థినులు కునుముల్ల సాహిత్య, పల్లా మౌనిక ఇటీవల యూజీసీ నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్)లో విజయం సాధించగా, వారిని వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్, విభాగాధిపతి రాధికారాణి అభినందించారు.

'ఆ స్థలం కోసం నిరాహార దీక్ష చేస్తాం'

నయీంనగర్, మార్చి 26 : గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ జవహర్‌కాలనీలోని తమ స్థలంలో ఉన్న గోడను కార్పొరేషన్ అధికారులు ఎలాంటి సమాచారం లేకుండా కూల్చివేశారని, ఆ భూమిని కాపాడుకునేందుకు ప్రధాన కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తామని బాధితులు ఒక ప్రకటనలో తెలిపారు. భూ కబ్జాదారులకు అధికారులు సహకరించడం వల్ల తమకు అన్యాయం జరుగుతున్నదని, కోర్టులో కేసు నడుస్తుండగా ఇలా చేయడం సరైనది కాదని తెలిపారు. అయితే బల్దియా అధికారులు అనుమతి లేదని కూల్చేయడం.. కొందరు ఆ స్థలం తమదేనని చెప్పడం చర్చనీయాంశమైంది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

jobs Apply Now!

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

PLOT FOR SALE
★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

CHANGE OF NAME
★I, KAKAVETI SWARNALATHA W/o KAKAVETI BHASKAR, R/o H.No. 2-10-361/1/4/101, Teachers Colony, Phase-II, Waddepally, Hanamkonda. T.G. Have changed my name from KAKAVETI BHARGAVI W/o KAKAVETI BHASKAR to KAKAVETI SWARNALATHA W/o. KAKAVETI BHASKAR for all purposes.
NTW-000

LOST OF DOCUMENT
I, Vasumathi Nyalakonda, W/o Late N.Manikya Rao, Aged: 71 Yrs, R/o 5-11-178/D/6, Swapnalok Complex, Naimnagar, Hanamkonda, Hanumakonda Dist., Giving paper advertisement in Related to Lost of Original Link Sale Deed No. 4731/1994 pertains to Open Plot No 2 in SY No. 59, Admeasuring 555.55 Sq.Yds at rekurthi Village, Karimnagar Dist. Lost document on 23-03-2025 near excise colony, Hanamkonda. If any body finds my above said sale deed, Pls
Call: 8099257551

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో సమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

##